క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



నారాయణపేట రూరల్: పట్టణంలోని సుభాష్ రోడ్డులో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆకస్మిక దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎఫ్ బియ్యం పట్టుబడ్డాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెగ్యులర్ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఉదయం పక్కా.. సమాచారంతో సుభాష్‌రోడ్డులోని నర్సింహులు, అనంతయ్యలకు చెందిన ఇళ్లలో సోదాలు నిర్వహించారు. 4.8 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వెంటనే రెవెన్యూ అధికారులను పిలిపించి పంచనామా నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవికి రాజీనామా

మక్తల్: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తన పదవికి, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేసి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డికి తెలియజేశారు. రాజీనామాను ఆమోదించాలని కోరారు. నా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశానని చెప్పారు.

వికటించిన ఆర్ఎంపీ వైద్యం

- ఓ వ్యక్తికి ప్రాణాపాయస్థితి
- రాయిచూర్ ఆస్పత్రికి తరలింపు

కృష్ణా: మండల పరిధిలోని తంగిడికి చెందిన కల్లప్పగౌడ్‌కు గురువారం ఉదయం మూత్రంలో మంట వస్తుందని మండల కేంద్రంలోని ఆర్ఎంపీ మోహిద్దీన్ వద్దకు వెళ్లాడు. దీంతో ఆర్ఎంపీ పరీక్షించి మూత్రాశయంలో రాళ్లు ఏర్పడ్డాయి ఆపరేషన్ చేయాలని చెప్పి, క్లీనిక్‌లో అడ్మిట్ చేసుకున్నాడు. ఆ తరువాత మూత్రనాళానికి పైప్ వేసి చికిత్స చేశాడు. ఆ తర్వాత కల్లప్ప గౌడ్‌ను రాయిచూర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురై వెంటనే రాయిచూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోని వైద్యులు పరిశీలించి ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించడంతోనే ప్రాణాపాయ స్థితి ఏర్పడిందని, చికిత్స చేస్తున్నామని తెలియజేశారు. ఆర్ఎంపీకి క్లీనిక్‌తో పాటూ సొంతంగా అనుమతి లేని ఓ మెడికల్ షాప్ ఉందని, ఈ విషయంపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటూ, డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు.

బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటాం

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలను విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో ఓటమి తప్పదని.. బీసీలను నమ్మించి మోసం చేసి విభజించి పాలించాలని చూస్తున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణను ఓడిస్తామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. మహబూబ్‌నగర్ బరిలో దాదాపు 10 నుంచి 15 మంది బీసీ బిడ్డలు పోటీలో ఉండడం గర్వకారణమన్నారు. లోక్‌సభ పరిధిలో ఉన్న బీసీ అభ్యర్థుల్లో అధిక జనాభా ఉన్న అభ్యర్థిని గుర్తించి వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపునకు కృషి చేస్తామన్నారు. మూడు ప్రధాన పార్టీలు ఈ సారి బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకత కూడగట్టుకున్నట్లు తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో అత్యధిక సామాజిక వర్గమైన వాల్మీలకు బీజేపీ సీటు కేటాయించి అక్కడ మాజీ ఎమ్మెల్యే హోదాలో డీకే అరుణ తమ పార్టీకి చెందిన బీజేపీ అభ్యర్థి ఓటమికి సహకరించినట్లు ప్రత్యక్ష ఉదాహరణలు ఉన్నాయన్నారు. గద్వాలలో బీసీల మధ్య కొట్లాటపెట్టి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో కీలకంగా వ్యవహరించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

అమలు కాని తీర్మానాలు

- పట్టించుకోని అధికారులు
- అలసత్వం వీడాలనే ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు
- నేడు మండల సర్వసభ్య సమావేశం



అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయంలో ఫిబ్రవరి 7న జరిగిన కృష్ణా సర్వసభ్య సమావేశంలో గౌరవ సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో చేసిన తీర్మానాలు నేటికి అమలు కావడంలేదు. ప్రధానంగా చర్చకు వచ్చిన అంశం ఐసీడీఎస్ శాఖకు సంబంధించి మండలంలో 33 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. కేవలం ఒక్క సెంటర్‌కు మాత్రమే ప్రభుత్వ భవనం ఉందని, మిగితా కేంద్రాలకు భవనాలు లేక ఇబ్బందులు ఉన్నాయని సూపర్‌వైజర్ అమ్మక్క సభ దృష్టికి తీసుకొచ్చారు. కాగా ఈ సమస్య పరిష్కారానికి గాను ఎమ్మెల్యే తక్షణమే గ్రామాల్లోని పాత గ్రామపంచాయతీ భవనాలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని, అదే విధంగా కొత్త భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించుకునే అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ సభలో తీసుకున్న నిర్ణయాలను వచ్చే సర్వసభ్య సమావేశం నాటికి పూర్తి చేయాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినా మండల అధికారుల్లో మాత్రం మార్పురావడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలు నిర్వహించి మమ అనిపించడం కాదని, వచ్చే సమావేశానికి ఇప్పుడు చర్చించిన అన్ని విషయాలు పురోగతిలో ఉండాలని అన్నారు. అధికారులు పని చేయాలని ముందుగా విజ్ఞప్తి చేస్తా, వినకుంటే పరిణామాలు వేరుగా ఉంటాయని ఆ సమావేశంలో ఎమ్మెల్యే హెచ్చరించారు. కాని శనివారం జరిగే సర్వసభ్య సమావేశంలో ఎన్ని సమస్యలు పరిష్కరించామని అధికారులు సభకు తెలియజేస్తారో వేచిచూడాలి.

బీజేపీ విధానాలను ప్రతిఘటించాలి


మాట్లాడుతున్న కాశీనాథ్

నారాయణపేట: నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 13న కొనసాగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లందరూ బీజేపీకి బుద్ధి చెప్పాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట 138వ మే డే సందర్భంగా జెండాను సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ టౌన్ కార్యదర్శి నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ హాజరై మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలు రద్దు చేసి పెట్టుబడిదారులకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. కార్మికవర్గంపై ఫాసిస్ట్ విధానాలు అమలు చేయడంతో కనీస వేతనాల అమలకు నోచుకోలేదన్నారు. ఉద్యోగ భద్రత కరువై కోట్లాది మందికి ఉపాధి లేక రైతుల, కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘం నాయకులు నరసింహ, సలీం, శివాజీ, నజీర్, రాములు, సాయి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

‘వంశీచంద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి’

నారాయణపేట: మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని మహిళా మోర్చా పేట జిల్లా అధ్యక్షులు లక్ష్మి, బీజేపీ జిల్లా కార్యదర్శి బి.సుజాత, కౌన్సిలర్ ప్రమీల, మాజీ కౌన్సిలర్ సూర్యకళ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను అసభ్యంగా మాట్లాడి మహిళలను కించపరిచి, మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.


ఫిర్యాదు చేస్తున్న మహిళా మోర్చా నాయకులు

బీరదేవర బండారు ఉత్సవాలకు చిట్టెం హాజరు


హిందుపూర్‌లో నిర్వహించిన బండారు ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో కొనసాగుతున్న బీర దేవర బండారు ఉత్సవాలకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, టీఎస్ టీపీసీ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కురుమ యాదవులు నిర్వహించే పవిత్రమైన ఈ బండారు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


కున్సిలో అవగాహన కల్పిస్తున్న సీఎఫ్ఎల్ కౌన్సిలర్ అనుసూయ

కృష్ణా: సైబర్ నేరాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, దీనిపై పూర్తి అవగాహన అవగాహన అవసరమని సీఎఫ్ఎల్ కౌన్సిలర్ అనుసూయ సూచించారు. శుక్రవారం మండలంలోని ఆలంపల్లి, కున్సి గ్రామాల ప్రజలకు సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫోన్‌లో సైబర్‌నేరగాళ్లు కేవైసీ చేయాలని, లిక్కిలాటరీ గెలిచారని, ఓటీపీ చెప్పాలని ఇలా రకరకాలుగా అడగడంతో అమాయకులు వారి మాయమాటలు నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇలాంటి మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇందులో ఎంపీడీఓ జానయ్య, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ తాయప్ప గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం


ఎలిగండ్లలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మరికల్: మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మరికల్‌తో పాటు ఎలిగండ్ల తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రామస్వామి, బసంత్, మోహన్, ప్రకాశ్‌శెట్టి, హన్మంతు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ కరువు


మొక్కలను మేస్తున్న మేకలు

మాగనూర్: మండల కేంద్రంలోని ఎన్‌హెచ్-167పై డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. అయితే వాటికి రక్షణ కరువైంది. మొక్కలైతే పెట్టారు కాని వాటికి సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో మేకలు గుంపులుగా వచ్చిన మొక్కలను మేస్తున్నాయి. కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివైడర్‌కు సంబంధించి బారికేడ్లు ఇరువైపుల పెట్టి ఉంటే బాగుండేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మళ్లీ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరుతున్నారు.

దళితులకు న్యాయం చేయాలి

మాగనూర్: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యంతో బాధితులకు న్యాయం చేయడంలో భాగంగా అకారణంగా దళితులపై రాళ్లు, కొబ్బరి బొండాలు, కర్రలతో దాడి చేసిన వారిని వెంటనే రిమాండ్‌కు పంపి దళితులకు న్యాయం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు సగరం రమేష్ మాట్లాడారు. తీవ్రస్థాయిలో వివక్ష పూరితంగా చేసిన దాడిని సాధారణ దాడిగా చిత్రీకరించి నిందితులను ఇప్పటి దాకా అరెస్టు చేయలేదన్నారు. వారిని అరెస్టు చేయకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. సంఘం నాయకులు మహేష్, రాఘవేంద్ర, మధు, శ్రీను, మారుతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాట నిలబెట్టుకుంటుంది


తీలేర్ రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


సింగారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మరికల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని శుక్రవారం మరికల్, మాధవరం, రాకొండ, తీలేర్, ఎలిగండ్ల, పస్పుల, పల్లెగడ్డ గ్రామాల్లో రోడ్డుషోలు నిర్వహించి మాట్లాడారు. ఈ జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎంపీగా పోటీ చేస్తున్న వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లా ప్రజలకు ఉచిత విద్యుత్‌తో పాటు రూ.500 సబ్సిడీ సిలిండర్ పథకాలు అమలు చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

మరికల్, మాధవరంలో ఇతర పార్టీల నుంచి దాదాపు 150 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వీరన్న, రేవతమ్మ, సూర్యమోహన్, కృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

మరికల్: నారాయణపేట జిల్లాకు సంబంధించి ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి తరఫున ప్రచురించిన ప్రచార పోస్టర్లపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఫొటో లేకపోవడంతో తీలేర్‌లో ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం తీలేర్‌లో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఎన్నికల రోడ్ షో ఉండగా.. గ్రామంలోని ఇళ్ల గోడలపై అతికిచ్చిన పోస్టర్లపై పేట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి ఫొటో లేకపోవడం ఏమిటని ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రశ్నించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిని అవమానించడం తగ్గదని హెచ్చరించారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి

నారాయణపేట: మండలంలోని సింగారంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంకల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కాట్రోని చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మాజీ సర్పంచ్ సిద్రామప్ప, సూరత్ మల్లప్ప, జోగిని హన్మంతు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ఇంటింటి ప్రచారం

కృష్ణా: మండంలోని ముడుమాల్, కున్సి, చేగుంట గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల యువజన నాయకుడు భీమశంఖర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలే తమ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలుపిస్తాయని అన్నారు.

మాగనూర్: మండలంలో మాగనూర్, కొత్తపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడారు. వంశీచందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు రైతు రుణమాఫీ చేస్తుందన్నారు.

వారిని గెలిపించి.. గోసపడుతున్నారు


ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ధన్వాడ: కొత్త ఆశలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ నిజంగా ఇస్తుందేమో అని ఆశ పడి ఓటు వేసి గెలిపించారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు మరిచి కేసీఆర్ ఇచ్చిన పథకాలు సైతం నిలిపివేయడంతో ఇప్పుడు ప్రజలు గోస పడుతున్నారని నారాయణపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గున్ముక్ల, గోటూర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ రైతులకు ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, వరి కొనుగోలు ఇలా అనేక పథకాలను తీసుకొస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వారు చెప్పిన ఆరు గ్యారంటీలు ఇవ్వాల్సింది పోయి ఉన్న పథకాలు నిలిపివేశారని అన్నారు. డిసెంబర్‌లో రైతు రుణమాఫీ చేస్తామన్నారు. తర్వాత జనవరిలో అన్నారు. ప్రస్తుతం ఆగస్టులో చేస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తే ముందుగా వారు చేసేది రైతుల పొలాల్లో మీటర్లు బిగిస్తారని అన్నారు. ప్రజలు వీటిని గుర్తించి బీఆర్ఎస్ అభ్యర్థి మన్యం శ్రీనివాస్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానించారు. వెంకట్‌రెడ్డి, సుధీర్‌కుమార్, శ్రీనివాస్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

‘పేట’లో ఎస్ఆర్‌రెడ్డి విస్తృత ప్రచారం

నారాయణపేట: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరుతూ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట చిరు, బడా వ్యాపారస్తులను కలుస్తూ.. విస్తృత ప్రచారం నిర్వహించారు. సత్యనారాయణ చౌరస్తా నుంచి ఆయన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాదయాత్రతో ప్రచారం చేపట్టారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో చెప్పడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. విజయసాగర్, జగదీశ్, ప్రతాప్‌రెడ్డి, చెన్నారెడ్డి, మహిమూద్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.


పేటలో కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.ఆర్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కోస్గి: బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో 8, 9 వార్డులో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌నర్సింహ, సాయప్ప, శాసం కేశవులు, యాదయ్య, మల్లేష్, నవీన్ తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


పగిడిమారిలో ఇంటింటి ప్రచారం చేపడుతున్న బీజేపీ నాయకురాలు రత్నారెడ్డి


బీజేపీలో చేరిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు

ఊట్కూరు: ఊట్కూరు మండలంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలంటూ కోరుతూ శుక్రవారం డీకే అరుణ సోదరి రత్నారెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండలంలోని కొల్లూరు, పెద్ద పొర్ల, ఓబులాపూర్, పగిడిమారి తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ.. డీకే అరుణను గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, అశోక్‌కుమార్, భీంరెడ్డి, దేవేంద్రప్ప, వెంకటప్ప, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంతో పాటూ కున్సి, ఆలంపల్లి గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో డీకే అరుణను గెలుపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. శ్రీనివాసులు, నర్సప్ప, రాఘవేంద్ర, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్‌లో

మాగనూర్: మండలంలోని మాగనూర్, వర్కూర్, నేరడ్గం, వడ్వాట్, ఒబ్లాపూర్, మందిపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకుల ప్రచారం జోరుగా సాగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు నారాయణ తెలిపారు. దేశంలో మోదీ పరిపాలనలో పదేళ్ల అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు.

డీకే అరుణ గెలుపు ఖాయం

మరికల్: మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ అభ్యర్థికి వస్తున్న ఆధరణతో డీకే అరుణ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి అన్నారు. మండలంలో శుక్రవారం చిత్తనూర్, కన్మనూర్, జిన్నారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీజేపీలో చేరికలు

మరికల్: బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రాజేష్‌యాదవ్ డీకే అరుణ సమీక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. మరికల్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయనతో పాటు ఎలిగండ్ల, కన్మనూర్‌కు చెందిన మరో 30 మంది బీఆర్ఎస్ నాయకులకు డీకే అరుణ కండవ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎలిగండ్ల మాజీ సర్పంచ్ లింగారెడ్డి కూడా పార్టీలో చేరారు. కార్యక్రమంలో వెంకటేష్, వైడిగుప్త, రవిప్రకాష్, లింగారెడ్డి, బాల్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానది తీరంలో అగ్నిప్రమాదం

- కాలి బూడిదైన రైతుల మోటార్లు, పైప్‌లైన్లు
- రూ.6 లక్షల వరకు ఆస్తినష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు


నదీ తీరంలో కాలిపోయిన పైపులు, మోటార్లు


నదీ తీరంలో కాలిపోయిన మోటార్లు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామపంచాయతీలోని టైరోడ్డు సమీపంలోని కృష్ణానది తీరంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వందల కొద్ది ఎకరాల సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా మొత్తం శుక్రవారం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నది నుంచి రైతులు దర్గురావ్, కృష్ణమూర్తి, ముస్క వెంకప్ప, పంతిగి మహాదేవ్, బొల్ల శివరాజ్, రామరాజ్, కార్తీక్‌రాజ్, శ్రీనివాస్‌రాజ్,వె వెంకటపతిరాజ్‌లు తమ పొలాలకు సాగునీటిని అందించేందుకు నదిలో పైప్ లైన్లు, విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుని పంటలు పండించుకుంటున్నారు. ప్రస్తుతం పంట కోతలు, పనులు అయిపోవడంతో రైతులు ఇటువైపు చూసుకోలేదు. ఆకతాయిల పనో, అనుకోకుండా జరిగిన ప్రమాదమో అక్కడ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో విద్యుత్ స్తంభాలకు చెందిన వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. వీటి విలువు దాదాపు రూ.6 లక్షలకు పైగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచే రాత్రి పగలు తేడా లేకుండా నదిలోని ఇసుకను అక్రమార్కులు ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. అగ్ని ప్రమాదానికి కారణం కూడా అక్రమార్కుల పనే ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. అగ్ని ప్రమాదానికి కారణమైన దుండగులపై కటిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి..



నాకున్న 10 ఎకరాలతో పాటూ మరో 70 ఎకరాలు కౌలుకు తసుకున్నా. ఆ పొలాలకు నీటిని అందించేందుకు గాను గతేడాది నదికి పైపులైన్లు, మోటార్లు ఏర్పాటు చేసుకున్నా. ప్రస్తుతం మోటార్లు, పైప్‌లైన్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. దీంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఎవరో కావాలనే ఇక్కడ నిప్పుపెట్టారు. అధికారులు ఆ అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలి. మా కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– దుర్గరావ్, రైతు, గుడెబల్లూర్

మోటార్ల వైర్లు చోరీ చేశారు..



మా పొలాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు ఏర్పాటు చేసుకున్నాం. కాగా ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పొలాల వద్దకు వెళ్లడం లేదు. ఇదే అదునుగా తీసుకున్న దొంగలు మోటార్ల వైర్లను చోరీ చేశారు. ప్రస్తుతం మళ్లీ మేము వేసుకోవాలంటే రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. పొలాలకు నిప్పుపెట్టడం, దొంగతనాలు చేయడం ఇక్కడ సర్వసాధారణమైంది. పోలీసులు తగు చర్యలు తీసుకొని రైతులకు సాయం అందించాలి.

– బొల్ల తిమ్మప్ప, గుడెబల్లూర్